ప్రజాశక్తి
మంగళవారం 28 మార్చి 2023
5
అనంతపురం



మహిళా పక్షపాతి సీఎం జగన్ : మంత్రి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మహిళా పక్షపాతి సిఎం జగన్మోహన్‌రెడ్డి అని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. సోమవారం నాడు కంబదూరు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో వైఎస్సార్ ఆసరా 3వ విడత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తున్నారని తెలిపారు. అనంతరం కంబదూరు మండల వ్యాప్తంగా మంజూరైన ఆసరగా మెగా చెక్కును మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

సంక్షేమ పాలన అందిస్తాం

- ప్రతి ఏడాదీ జాబ్‌క్యాలెండర్ విడుదల
- రైతులకు సబ్సిడీ పథకాల పునరుద్ధరణ
- యువగళం పాదయాత్రలో నారాలోకేష్

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్

ప్రస్తుతం కోతల పాలన కొనసాగుతోందని, 2024లో టిడిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పాలను అందిస్తామని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 52వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం తిప్పరాజుపల్లి నుంచి మొదలైంది. అక్కడ నుంచి గోరంట్ల, గుమ్మయ్యగారిపల్లి వరకు కొనసాగింది. సాయంత్రం గమ్మయ్యగారిపల్లి విడిది కేంద్రం వద్ద బస చేశారు. వడ్డెర, నాయీబ్రాహ్మణులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను నారా లోకేష్‌కు విన్నవించారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. లోకేష్‌ని చూసేందుకు రోడ్ల పైకి జనం భారీగా చేరుకున్నారు. వీరందరికీ అభివాదం చేస్తూ, పలకరిస్తు లోకేష్ పాదయాత్రను కొనసాగించారు. గోరంట్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ ప్రసంగించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి హవా కొనసాగడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వణుకు పుడుతుందని చెప్పారు. మద్యపానాన్ని నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మద్యాన్ని ఏరులైపారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి సైతం రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని చెప్పారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రజలపై పన్నుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు జాబ్ కాలండర్ విడుదల చేస్తామన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్పును అందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అది అందడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే రైతులకు సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని మరచి పాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సబితమ్మ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నరసింహులు, మరిరెడ్డిపల్లి నరసింహులు, బాలకష్ణ చౌదరి, దాసయ్య, ఫిరోజ్ బాషా పాల్గొన్నారు.



గోరంట్లలో యువగళం పాదయాత్రలో పాల్గొన్న టిడిపి శ్రేణులు



లోకేష్‌కు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

అడుగడుగునా ఘనస్వాగతం

గోరంట్ల మండలంలో నారా లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం లభిస్తోంది. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలుకుతున్నారు. గోరంట్లలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప నివాసం వద్ద భారీ గజమాలతో స్వాగతం పలికారు. గాంధీ విగ్రహం వద్ద టిడిపి నాయకులు జయరాం, వేణు, బాలాజీ, రాయల్ నరేంద్ర, నీలకంఠారెడ్డి, నరసింహప్ప, సుధాకర్ రెడ్డిలు సైతం గజమాలతో స్వాగతం పలికారు. బస్టాండ్ వద్ద మైనార్టీ యువ నాయకుడు ఉమ్రాన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఎరుకుల సంఘం గౌరవాధ్యక్షులు ఎల్ఎన్.నారాయణస్వామి యాపిల్‌పండ్లతో తయారుచేసిన గజమాలతో స్వాగతం పలికారు.

సమస్యలు పరిష్కరించకుండా..సమ్మేళనాలా..?

- పట్టు రైతులపై ప్రభుత్వానికి చిన్నచూపు
- మద్దతు ధర నిర్ణయించకుండా నిర్లక్ష్యం
- పట్టు రైతు సమ్మేళన సభ వద్ద నిరసన



రైతు సమ్మేళన సభ వద్ద అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టు రైతులు



అధికారులను నిలదీస్తున్న రైతులు

ప్రజాశక్తి-హిందూపురం

'పట్టు రైతుల సమస్యలను పరిష్కరించాలని గత నాలుగు సంవత్సరాలుగా స్థానిక అధికారుల నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు వినతిపత్రాలను ఇచ్చాం. స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి ముఖ్యమంత్రి వరకు సమస్యలను అనేకమార్లు విన్నివించాం. అయినా పట్టు రైతుల సమస్యలు పరిష్కారం కాలేదు. సమస్యలకు పరిష్కారం చూపకుండా పట్టు రైతులకు ఏదో మేలు చేశామన్నట్టు పట్టు రైతు సమ్మేళనం నిర్వహించడం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదు. పట్టుగూళ్లకు కనీస మద్దతు ధర నిర్ణయించి, రైతులను సమస్యలను పరిష్కరించాలి. లేకుంటే ఎన్ని సమావేశాలు నిర్వహించినా ప్రయోజనం లేదు'. అంటూ పట్టు రైతులు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని టిటిడి కళ్యాణమండపంలో కేంద్ర, రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పట్టు రైతులసమ్మేళనం-2023 సభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఉమ్మడి కర్నూలు, చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు రైతులు, కేంద్ర రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సభ ప్రారంభం కాగానే రైతులు నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దాదాపు 3 గంటల పాటు సమావేశం భవనం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టు రైతులు ఆనంద రంగారెడ్డి, చైతన్య గంగిరెడ్డి, ధనాపురం వెంకటరామిరెడ్డి, నవీన్, జయరామిరెడ్డి తదితరులు మాట్లాడుతూ గతంలో బైవోల్టీన్ పండించే పట్టు రైతులకు కిలో రూ.50 చొప్పున ప్రోత్సాహం అందించేవారని, గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి ఈ ప్రోత్సాహం ఒక్క రైతుకూ అందలేదన్నారు. దాదాపు రూ.50 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి బైవోల్టీన్ ప్రోత్సాహం నగదు పట్టు రైతులకు అందాల్సి ఉందన్నారు. ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు ఇన్సెంటీవ్ రూపంలో బకాయిలు రావాల్సి ఉన్నాయని తెలిపారు. పట్టుపరిశ్రమ అంటే ప్రభుత్వానికి పట్టనట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్సిడి ధరకు గతంలో అందించే మందులు, ఇతర పరికరాలు, నేతికలు, మల్బరీ షెడ్లకు ఆర్థిక సాయం ఇవ్వడం లేదన్నారు. పెరిగిన ధరలతో రైతులు పట్టుగూళ్ల ఉత్పత్తి చేయటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. పట్టుగూళ్లకు కనీస మద్దతు ధర నిర్ణయించి పట్టు రైతులను ఆదుకోవాలన్నారు. పట్టు రైతుల సమస్యలను పరిష్కరించిన తరువాతనే పట్టు రైతు సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించాలని పట్టుబట్టారు. ఈ సమయంలో పట్టుపరిశ్రమ శాఖ ఆడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి, అగ్రిబోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త కిరణకుమార్ తదితరులు రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా రైతులు వారి మాటను వినలేదు. సమస్యల పరిష్కారంపై సమ్మేళనంలో అధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసన విషయాలను అడిషనల్ డైరెక్టర్ కమిషనర్ దష్టికి సెల్‌ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. ఆయన నుంచి స్పష్టమైన హామీ రాకపోవటంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు రైతులకు ఎంత నచ్చజెప్పిన వారు వినక పోవడంతో సభను అర్ధాంతరంగా ముగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భోజన విరామం అనంతరం అక్కడున్న రైతులతో అధికారులు పట్టురైతుల సమ్మేళనాన్ని నిర్వహించి మమ అనిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, సిబ్బంది, పట్టు రైతులు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీకి తరలివెళ్దాం..

సిఐటియు, రైతు, కార్మిక సంఘాల నేతల పిలుపు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్ 5వ తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి అందరూ తరలివెళ్లి జయప్రదం చేద్దామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. సోమవారం గణేనాయక్ భవన్‌లో కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీ సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల సవరణను వెనక్కి తీసుకోవాలన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. సంవత్సరానికి 200 రోజులు పని రోజులు కల్పించాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలన్నారు. అవుట్‌సోర్సింగ్ టైం స్కేల్ వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. 5వ తేదీన ఢిల్లీలో జరిగే మహా ధర్నాకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, చెన్నారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి వాటర్ వర్కర్స్ అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి రామాంజనేయులు, శ్రీసత్య సాయి వాటర్ ప్రాజెక్టు అధ్యక్షులు తిప్పయ్య స్వామి, కార్యదర్శి మహబూబ్‌బాషా, ట్రెజరర్ హనుమంత రాయుడు, జి.నాగరాజు, వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కొండారెడ్డి, రమేష్ రెడ్డి, గంగాధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపో హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో

ఏప్రిల్ 5వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఐఎంఎల్ డిపో హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్‌లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు టి.రామాంజినేయులు, మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాగార్జున, పుష్పరాజు, పెద్దన్న, మారుతి, చెన్నారెడ్డి, మోహన్‌బాబు, ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న హమాలీలు పాల్గొన్నారు.



చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

తాడిపత్రిలో శాంతికోసమే పాదయాత్ర

- ఇసుకపై బహిరంగ విచారణకు సిద్ధం
- జెసి.నాగిరెడ్డి పథకాన్నీ మేమే పూర్తి చేసాం..
- ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి నియోజకవర్గంలో మూడు దశాబ్ధాలకుపైగా ఒకే కుటుంబం అధికారంలో ఉంది. వీరు ప్రతి గ్రామంలోనూ గ్రూపులు పెట్టి కక్షలు, కార్పణ్యాలు పెంచి పోషించారు. 2019లో తాను తాడిపత్రి ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకోల్పే ఉద్ధేశంతోనే పాదయాత్రను చేపడుతున్నట్టు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ప్ర : రాజకీయ నాయకులు సాధారణంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలు చేస్తుంటారు... మీరు అధికారపార్టీ ప్రజాప్రతినిధిగా ఉన్నారు... ఇప్పుడు పాదయాత్రను ఏ లక్ష్యం కోసం చేపట్టారు.?

పెద్దారెడ్డి : వైసిపి పాలనలో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారు. సంక్షేమ పాలన సాగుతోంది. ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల పథకాలనూ ఎవరి ప్రమేయం లేకుండా అందజేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయి. అయితే ఈ నియోజకవర్గం వరకు వచ్చే సరికి ప్రత్యేకమైన పరిస్థితులు కొన్ని ఉన్నాయి. 30 ఏళ్లుగా జెసి కుటుంబమే అధికారంలో ఉంటూ వచ్చింది. ఈ కుటుంబ చేతిలో అనేక మంది ఇబ్బందులు పడ్డారు. ఒక రకంగా చెప్పాలంటే కక్షలు కార్పణ్యాలను పెంచి పోషించారు. అందులో చాలా మంది నలిగిపోయరు. ఇకపై అలాంటి వాతావరణం ఇక్కడ లేకుండా ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఉండాలని ఈ పాదయాత్రలో కోరుతున్నాం. రాజకీయంగా ఏమైనా ఉంటే నేరుగా నేను తలపడతాను. సామాన్యులు ఇందులో భాగస్వాములు కావద్దని కోరుతున్నాం. ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశ్యం నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం నెలకొనాలన్నదే.

ప్ర :నియోజకవర్గ అభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టారు.?

పెద్దారెడ్డి : నియోజకవర్గ అభివృద్ధికి తాము అధికారంలో వచ్చాక అనేకం చేపట్టాం. తండ్రుల పేర్లు పెట్టుకుని పూర్తి చేయకుండా ఉన్న జెసి.నాగిరెడ్డి తాగునీటి పథకాన్ని తాము అధికారంలోకి వచ్చాక ఒక కొలిక్కి తీసుకొచ్చి నీటిని అందిస్తున్నాం. జల్ జీవన్ మిషన్ కింద రూ.18.36 కోట్లతో పనులు చేపట్టాం. రూ.15.79 కోట్లతో సిసి డ్రైన్సు, రూ.2.01 కోట్లతో రోడ్లు, డిఎంఎఫ్ నిధులతో 83 పనులు, గ్రామ గ్రామ సచివాలయాల నిర్మాణం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, విలేజ్ క్లీనిక్‌ల నిర్మాణం, నాడు-నేడు కింద పాఠశాలల నిర్మాణం చేపట్టాం.

ప్ర: ఇసుకలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని మీ ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.దీనికి మీ సమాధానం ఏమిటి ?

పెద్దారెడ్డి : ఇసుకలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న మాట వాస్తవం. అందుకే వారికి ఒక్కటే చెబుతున్నా... దీనిపై బహిరంగ విచారణకు సిద్ధమని సవాల్ ఇదివరకే విసిరాను. దీనికి కట్టుబడి ఉన్నాను. వారి ఇంటి వద్దకు రామన్నా వెళ్లి బహిరంగ చర్చలో పాల్గొంటాను. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకపై ఒక విధానం తీసుకొచ్చింది. ప్రత్యేకంగా దీనిపై ఒక వ్యవస్థ పనిచేస్తోంది. అక్రమాలు జరిగితే ఆ సంస్థలు చర్యలు తీసుకుంటాయి. ఇప్పటికే వారు ఆరోపణలు మాని చర్చకు వస్తే బాగుంటుంది.

ప్ర : తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు గతకొన్నేళ్లుగా ఆయకట్టుకు నీరవ్వని పరిస్థితులున్నాయి..ఈ ఏడాది నీరు పుష్కలంగా వచ్చినా నీరివ్వలేకపోయారు ?

పెద్దారెడ్డి : గత కొన్నేళ్లుగా ఆ కాలువ నిర్వహణ సరిగాలేకపోవడంతో సమస్య ఉంది. అయినా మా సొంత నిధులతో అవసరమైన చోట బాగు చేయించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా సుబ్బరాయసాగర్, చాగళ్లు, ఇతర చెరువులకు కూడా నీరిచ్చాం. పంటల సాగు కూడా గతంతో పోలిస్తే బాగా పెరిగింది. సాగునీటికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాం.

ప్ర : గృహ నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. ఎప్పటిలోపు పూర్తి చేయవచ్చని భావిస్తున్నారు ?



పెద్దారెడ్డి : గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. టిడ్కో ఇళ్లతోపాటు, ఇతర గృహ నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం.

ప్ర : మీ ప్రత్యర్థులని చెప్పేవారు.. జెసి కుటుంబం వైసిపిలోకి వస్తుందన్న ప్రచారం జరుగుతోంది..వస్తే ఆహ్వానిస్తారా .?

పెద్దారెడ్డి : అటువంటిదేమి ఉండదు. వారిని మా కార్యాలయం గేటును కూడా మా నాయకుడు తాకనివ్వరు. అటువంటిది పార్టీలోకి తీసుకునే అవకాశమే ఉండదు. వారు ఇప్పుడున్న పార్టీలోనే ఆ పార్టీ కార్యాక్రమాలేవి చేయరు. ఒక్క ఎన్టీఆర్ వర్ధంతి తప్ప తక్కిన ఏ టిడిపి కార్యక్రమాలైనా చేపట్టిన దాఖలాలున్నాయా..? ఏవీ లేవు.

ప్ర : వచ్చే ఎన్నికల్లో మీరు బరిలో ఉంటారా... మీ తరుపున మీ వారసులుంటారా ?


పెద్దారెడ్డి : అటువంటిదేమీ లేదు... వచ్చే ఎన్నికల్లోనూ నేనే బరిలో ఉంటాను. ఎటువంటి మార్పులుండవు.

కార్పొరేషన్‌లో నిరసనల పర్వం

విపక్ష సభ్యులుగా మారిన అధికార పార్టీ సభ్యులు - రసాభాసగా 'అనంత' సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'రెండేళ్ల పాలన పూర్తవుతోంది.. ఎక్కడి సమస్యలు అక్కడే.. కార్పొరేటర్లు ప్రజా సమస్యలపై నిలదీస్తే అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది' అంటూ అధికార పార్టీ సభ్యులు ధ్వజమెత్తారు. మేయర్ మొహమ్మద్ వసీం అధ్యక్షతన సోమవారం స్థానిక కౌన్సిల్ హాలులో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే 7వ డివిజన్ కార్పొరేటర్ నాగమణి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సెంట్రల్ పార్క్ స్థలం అన్యాక్రాంతమవుతున్నా టౌన్ ప్లానింగ్ యంత్రాంగం పట్టించుకోలేదని మేయర్ పోడియం ముందు బైఠాయించింది. ఆమెకు తోడు కోఆప్షన్ సభ్యురాలు ఉమా మహేశ్వరి, కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ ఆందోళనకు దిగారు. దాదాపు గంటకుపైగా బైఠాయించినా అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు నివేదికను సభ ముందు ఉంచేందుకు ఆసక్తి చూపలేదు. అలాగే ఎఫ్ఎసి కమిషనర్‌గా ఉన్న రమణారెడ్డి సైతం రెండేళ్లుగా అదనపు కమిషనర్ హోదాలో కొనసాగుతున్న తనకు అవగాహన లేదని తప్పించుకోవడంతో డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే తాను కమిషనర్ రమణారెడ్డితో చర్చించామని, అయినా తెలియదని చెప్పడం బాధాకరమన్నారు. ఇలాంటి అధికారులు ఉండటం వల్లే కార్పొరేషన్‌కు చెడ్డపేరు వస్తోందని ధ్వజమెత్తారు. ఈదశలో కార్పొరేటర్ నీలావతి లేచి ప్రజా సమస్యలు పరిష్కరించడానికి జెసిబిలు అడిగితే అందుబాటులో లేవని సమాధానం చెప్పే అధికారులు అక్రమ కట్టడాలు జోలికి వెళ్లకుండా, దుప్పట్ల వ్యాపారం చేసే చిరు వ్యాపారుల వద్దకు ఆగమేఘాలపై జెసిబిలు తీసుకొచ్చి తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత 50వ డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల వరదల సమయంలో 4, 5వ రోడ్డు, రజకనగర్ వంటి ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. నడిమివంకను ఆక్రమించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. అప్పుడు ఎమ్మెల్యే దగ్గరుండి ఆక్రమిత స్థలాల్లో మట్టిని తొలగించారని గుర్తు చేశారు. అధికారులు అవినీతికి పాల్పడుతుండటం వల్లే పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఇంత జరుగుతున్నా అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు సెంట్రల్ పార్క్ స్థలం సర్వే నివేదికను తీసుకురాకపోవడంతో బాయ్‌కాట్ చేస్తున్నామని కార్పొరేటర్లు ప్రకటించడంతో చేసేది లేక స్వయానా మేయర్ పోడియం దిగొచ్చి సర్దిచెప్పడంతో సీట్లలో కూర్చున్నారు. ఆఖరికి అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఫైల్ తీసుకొచ్చి నివేదిక లేదంటూ ఎఫ్ఎంబి ప్లాన్ చూపించడంతో సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ దశలో కార్పొరేటర్లు అబుసాలేహా, వాసంతి, లీలావతి, నరసింహులు, శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి, సైదుల్లాబేగ్ తదితరులు మాట్లాడుతూ కౌన్సిల్లో ప్రతిపక్షం లేకున్నా తామే ప్రతిపక్షంగా మారి సమస్యలపై అధికారులను నిలదీస్తామన్నారు. తాము టీ, బిస్కెట్లు తిని తాగి వెళ్లే రకం కాదంటూ అల్టిమేట్ జారీ చేశారు. అధికారులు కార్పొరేటర్లకు జవాబుదారీగా ఉండి సమస్యలు పరిష్కరించాలి డిమాండ్ చేశారు. ముఖ్యంగా కార్పొరేటర్లను చులకనగా చూసే అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు.



మేయర్ పోడియం వద్ద నిరసన తెలుసుతున్న అధికార పార్టీ కార్పొరేటర్లు

ప్రజాశక్తి
www.prajasakti.com

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గుత్తి : పౌష్టికాహారం తీసుకుంటే బాలికలు, యువతులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఒ అగిశం నాగమణి పేర్కొన్నారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలు, యువతులకు రక్తహీనత, రుతుక్రమం, పరిశుభ్రత, పోషకాహారంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ రక్తహీనతను నిర్మూలించేందుకు దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు చిట్టెమ్మ, నారమ్మ, ఎఎన్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

శింగనమల : బుక్కరాయసముద్రం మండలం ఆరుబయలు కారాగారం ఖైదీలకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జనరల్ సర్జన్ డాక్టర్ రమణ నాయక్ తెలిపారు. జైలు సూపరింటెండెంట్ చిన్నారావు ఆదేశాల మేరకు 31 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరుబయలు కారాగారం సిఐ శివశంకర్, ఫార్మసిస్ట్ పవన్ ఎంఎస్ఒ నాగేంద్ర, ఖైదీలు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ఆత్మకూరు : ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రంథాయాలన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చూసుకోవాలన్నారు. గ్రంథాలయంలో న్యూస్ పేపర్లు, మ్యాగ్‌జైన్స్ పాఠకులకు అందుబాటులో ఉంచాలని గ్రంథాల అధికారి మల్లమ్మను ఆదేశించారు.

'యువగళం'లో దండు శ్రీనివాసులు

శింగనమల : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు పాల్గొన్నారు. సోమవారం పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం జీన బండ్లపల్లిలో లోకేష్‌తో కలిసి పాదయాత్ర చేశారు.

హుండీ కానుకల లెక్కింపు

నార్పల : గూగూడు కుల్లాయిస్వామి వారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. మొత్తం రూ.16,95,130 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వహణ అధికారి శోభ తెలిపారు. గ్రామ పెద్దలు, అర్చకులు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించినట్లు తెలియజేశారు.

నేటి నుంచి నగరంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురము నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం నుంచి నగర పాలక సంస్థ పరిధిలో ఆసరా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కార్యదర్శి సంఘం శ్రీనివాస్ తెలిపారు. అర్బన్ శాసన సభ్యులు అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, మేయరు వసీం సలీం, డిప్యూటీ మేయర్లు దాసరి వాసంతి సాహిత్య, కోగటం భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంటర్లు ముఖ్య అతిధులుగా హాజరవుతారని తెలిపారు.

తాడిపత్రి బార్ అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

తాడిపత్రి : తాడిపత్రి ఫస్ట్ క్లాస్ కోర్టు నందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సదాశివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కోర్టు ఆవరణంలో జరిగిన తాడిపత్రి బార్ అసోషియేషన్ సమావేశంలో ప్రెసిడెంట్‌గా బి.సదాశివ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా డి.శివయ్య, జనరల్ సెక్రటరీగా వై.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా డి.శివరామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా కె.వెంకటరమణారెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీగా వై.హనీఫ్‌బాషా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు న్యాయవాది శ్రీనివాసరావు తెలియజేశారు.

సచివాలయం ప్రారంభం

ఉరవకొండ : మండలంలోని రాయంపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని సర్పంచి సుజాత ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అట్టడుగున ఉన్న పేద వర్గాలకు చేరువ చేయాలనే సిఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తెచ్చారన్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సచివాలయ ఉద్యోగులు ఎంతోగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. పార్టీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ తేజోనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ పార్కు స్థలాన్ని కాపాడాలి

చెత్త పన్ను రద్దుచేయాలి
సిపిఎం ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా



మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

చెత్త పన్ను రద్దుచేయాలని, పెంచిన ఇంటి పన్ను తగ్గించాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని, సెంట్రల్ పార్కు స్థలాన్ని సర్వే చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్కును ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. సెంట్రల్ పార్కు స్థలాన్ని మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం స్వాధీనం చేసుకుని అక్కడ పార్కు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా మున్సిపల్ అధికారులకు చెవికెక్కడం లేదన్నారు. నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో అక్రమాలు జరుగుతున్నాయని పత్రికల్లో కథనాలు రాస్తున్నా అధికారులు, పాలకుల్లో చలనం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో పాడైపోయిన రోడ్లను, మురుగు కాలువలను బాగుచేయాలని కోరారు. గత ఏడాది వరదలు వచ్చి నష్టపోయిన అనంత ప్రజానీకాన్ని ఆదుకోవాలని, భవిష్యత్తులో వరదలు రాకుండా నడిమివంక సైడ్ వాల్ పూర్తి చేయాలని, నీలిమ టాకీస్ నుండి తపోవనం రోడ్డును వెడల్పు చేసి, రిషిత స్కూల్ దగ్గర బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పనుల్లో నాణ్యత కొరవడిందన్నారు. చిరు వ్యాపారాలు, తోపుడుబండ్ల వ్యాపారుల మీద సుంకాలను రద్దుచేయాలన్నారు. తాడిపత్రి బస్టాండులోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. అనంతపురం నగరంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని నగరానికి దూరంగా తీసుకెళ్లి సంరక్షించాలన్నారు. డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి నాయకుల వద్దకు వచ్చి తమ డిమాండ్లను కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూదు, బాబు, వలీ, ప్రసాద్, ఎన్టీఆర్ శీనా, రాజు, కెవిపిఎస్ వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, రజక వృత్తిదారుల సంఘం నాయకులు నాగభూషణం, శివరుద్ర, మల్లు, ఇస్మాయిల్, నాగరాజు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించొద్దు

ఓపెన్ స్కూల్ పరీక్షల సిఎస్, డిఒలకు డిఇఒ ఆదేశం



మాట్లాడుతున్న డిఇఒ సాయిరాం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఏప్రిల్ 3 నుంచి రెగ్యులర్ పదో తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా జరుగుతాయని, పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు అనుమతించొద్దని డీఈవో సాయిరామ్ ఆదేశించారు. సోమవారం నగరంలోని ఉపాధ్యాయ భవన్ లో ఓపెన్ స్కూల్ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో డీఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లను ఎంపిక చేశామన్నారు. మొత్తం 4037 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి వస్తారని, విద్యార్థులను మొదట్లోనే తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించాలన్నారు. ఏ ఒక్కరితోనూ సెల్ ఫోన్లు ఉండకూడదన్నారు. సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రికల్ పరికరాలను అనుమతించకూడదన్నారు. ప్రశ్న పత్రం లీక్ కాకుండా, మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు పూర్తి అయ్యేంత వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏసీ గోవింద నాయక్ మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా రెగ్యులర్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా పకడ్బందీగా నిర్వహిద్దామన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను నిబంధనల ప్రకారంగా నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ సిబ్బంది, సిఎస్, డిఒలు పాల్గొన్నారు.

కీర్తి మెడికల్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



జ్యోతిప్రజ్వలనతో వార్షికోత్సవ వేడుకలను ప్రారంబిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక సుభాష్ రోడ్డు లోని కీర్తి మెడికల్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ సంస్థ జనరల్ మేనేజర్ ధర్మేంద్ర ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ధర్మేంద్ర, అనంతపురం స్టోర్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ప్రజల ఆదరణతో సంవత్సర కాలం పాటు కీర్తి మెడికల్స్ సంస్థ దిగ్విజయంగా ముందడుగు వేసిందని అన్నారు. కస్టమర్ల శ్రేయస్సు కోరుతూ లాభాపేక్ష ప్రధానం కాకుండా వచ్చే ఆదాయంలో 20 శాతం కస్టమర్లకు నేరుగా డిస్కౌంట్ రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. అనంత ప్రజల అభిమానాన్ని ఆశిస్తూ తమ సంస్థ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్పెషల్ డిస్కౌంట్ ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని స్పెషాలిటీ ప్రొడక్ట్స్‌పై అదనపు డిస్కౌంట్ రూపంలో అందిస్తున్నామని వెల్లడించారు. అసిస్టెంట్ స్టోర్ మేనేజర్ అరుణ్, పవన్, సిబ్బంది మీనా కుమారి, మౌనిక, భాగ్య, ధరణి, సుహాసిని, శైలజ, మధు, అనిల్, అజయ్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఫార్మా-డీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జేఎన్టీయూ పరిధిలో ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించిన ఫార్మా-డి మొదటి సంవత్సరం (ఆర్ 17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆచార్య బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియుఎ వెబ్‌సైట్ హెచ్‌టిటిపి//జెఎన్‌టియుఎరిజల్ట్స్.ఎసి.ఐ ను సంప్రదించాలని కోరారు.

రమాదేవి కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



రమాదేవి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-నార్పల

దారుణ హత్యకు గురైన బొందలవాడ గ్రామానికి చెందిన దళిత యువతి రమాదేవి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె బొందలవాడ గ్రామానికి వెళ్లి రమాదేవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఐదు సెంట్ల ఇంటి స్థలం పట్టాను వారికి అందజేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఘటన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ హరిత రాజగోపాల్, ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ రఘునాథరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్, జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు

రమాదేవి కుటుంబాన్ని పరామర్శించడానికి బొందలవాడకు వచ్చిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు అడ్డుకున్నారు. దళితులపై దాడులు, హత్యలు, మానభంగాలు జరుగుతుంటే రక్షణ కల్పించలేరా అంటూ జెఎసి అధ్యక్షులు సాకే హరి ఎమ్మెల్యేను ప్రశ్నించారు. రమాదేవి హత్యలో పోలీసులు నిర్లక్ష్య వైఖరిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన మృతురాలి తల్లిదండ్రులను పోలీసులు బెదిరించడం సరికాదన్నారు. హంతకుడు జాఫర్ వలికే వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. రాజకీయ స్వార్థం వీడి ఈ ఘటనపై ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే వ్యవహరించాలన్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష టిడిపి, కాంగ్రెస్, బిజెపి, ఎస్సీ, ఎస్టీలను వంచిస్తూ శవ రాజకీయాలు చేస్తున్నారన్నారు. వీరికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రమాదేవిని కిరాతకంగా హత్య చేసిన జాఫర్ వలిని పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి ఉరి తీయాలన్నారు. కేసు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మృతురాలు కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు, ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అభ్యర్థులు స్వతంత్ర కుమారి, ఎరుకుల హక్కుల ప్రజా సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షురాలు గుజ్జల ముత్యాలమ్మ, లంబాడీ హక్కుల సంఘం పాల్యా గణేష్ నాయక్, జేఏసీ నాయకులు రేకలకుంట రామాంజనేయులు, కొర్రపాడు నాగేంద్ర, రామక్రిష్ణ, గోపాల్, కొండపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళాభివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, విశ్వ


ప్రజాశక్తి-ఉరవకొండ

మహిళాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు జరిగాయి. ఐకెపి ఎపిఎం శివయ్య, ఎంపీపీ చందా చంద్రమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ఇతర ప్రతిపక్షాలతో పాటు ఎల్లో మీడియా నిత్యం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. ప్రజలను అభివృద్ధి చేయాలని జగన్మోహన్ రెడ్డి ఎంతో పారదర్శకంగా నేరుగా వారి అకౌంట్లోకి నగదును బదిలీ చేస్తుంటే చూసి ఓర్చుకోలేని వారు రాష్ట్రంలో అభివృద్ధి లేదు అంటూ కొత్త ప్రచారాన్ని మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు లాగా జగన్మోహన్‌రెడ్డి మోసం చేయలేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా ఇచ్చిన మాట కోసం అహర్నిశలు కృషి చేస్తూ ప్రజలను అభివద్ధి చేస్తున్నారని చెప్పారు. అక్కచెల్లెమ్మలకు మూడో ఏడాది కూడా డ్వాక్రా రుణమాఫీకి రూ.6 వేల కోట్లు అకౌంట్లలో జగన్మోహన్‌రెడ్డి జమ చేశారన్నారు. మూడు విడతల్లో రూ.19 వేల కోట్లు మహిళల ఖాతాల్లో ఒక్క రుణమాఫీకే జమ అయిందన్నారు.అక్కచెల్లెమ్మలను మహారాణులుగా చేయడమే జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అని పేర్కొన్నారు. అనంతరం 995 మహిళా సంఘాలు, 9,995 మంది మహిళలకు 7 కోట్ల 57 లక్షల 47 వేల 9 రూపాయల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, కురుబ, ఎంబిసి రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేశులు, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సుశీలమ్మ, సర్పంచ్ లలిత, ఉప సర్పంచి వన్నప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు బ్యాంకు ఓబులేసు, వివిధ సంఘాల మహిళలు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి : స్థానిక చౌడేశ్వరి కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను మహిళా సంఘాల సభ్యులు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ కోట్ల రూపాయలతో మహిళా సంఘాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా కల్పించారన్నారు. ఆసరాతో జీవనోపాధి మహిళలకు ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, తహశీల్దారు అలెగ్జాండర్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సర్పంచి అనురాధ, ఉప సర్పంచి కాసా చంద్రమోహన్, వైస్ ఎంపీపీలు హసీనా బేగం, చెన్నప్ప, నాయకులు బొంబాయి బ్రదర్స్ వెంకటనాయుడు, బోగాతి బ్రహ్మానంద రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, బాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : స్థానిక జేసీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడుత సంబరాలను ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రెండురోజులకోసారి తాగునీరు అందించాలి : సిపిఎం



ప్రజాశక్తి గుంతకల్లు

వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు ఎద్దడి లేకుండా రెండు రోజులకు ఒకసారి అయినా నీరు అందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట పలు కాలనీల మహిళలు సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. పట్టణంలో మున్సిపల్ అధికారులు సమయ పాలన లేకుండా నాలుగు రోజులకు ఒకసారి అదీ అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున తాగునీరు వదులుతున్నారని అన్నారు. నీరు ఏ సమయానికి వస్తుందో అర్థం కాక ప్రజలు డబ్బులు చెల్లించి ప్రయివేటు ట్యాంకర్లతో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రధానంగా పట్టణ శివారు ప్రాంతాలైన సీఐటీయూ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎర్ర చెరువు, కాలనీ, సంతోష్ నగర్, బెస్త కాలనీ, పట్టణంలో అనేక చోట్ల ప్రజలు నీరు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని ప్రాంతాలలో పైప్‌లైన్ ఉన్నప్పుడు ఒక కొళాయి నుంచి నీరు వస్తుంటే మరొక కొళాయికి నీరు రాని పరిస్థితి కూడా ఉందన్నారు. వాటికి మరమ్మతులు చేసి ప్రజలకు వేసవి కాలంలో నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వార్డుల్లో పర్యటించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో నాయకులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతి ప్రసాద్, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు రాము నాయక్, అబ్దుల్లా, ఓబులేసు, చంద్ర పట్టణ మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తొండపాడులో ఇరువర్గాల ఘర్షణ

నలుగురికి గాయాలు

గుత్తి : గుత్తి మండల పరిధిలోని తొండపాడు గ్రామంలో ఆదివారం రాత్రి ఇరు వర్గాలు ఘర్షణ పడడంతో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తొండపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో చిన్న పాటి విషయంపై ఇరు వర్గాల వారు కర్రలు, కొడవళ్లతో దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాల దాడుల్లో ఈశ్వరయ్య, సంజప్ప, హనుమన్నలకు చేయి విరిగి తలకు బలమైన గాయాలు అయ్యాయి. సుధాకర్ స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో 44వ జాతీయ రహదారి వంతెనపై ఓ వృద్ధుడు మృతి చెందాడు. సుమారు 65 ఏళ్లు ఉండి తెల్ల అంగీ, పంచ ధరించిన ఆ వృద్ధుడు వంతెనపైన ఉన్న డివైడర్ల మధ్య మరణించాడు. సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో వృద్ధుడు మరణించి ఉంటాడని పోలీసులు చెబుతున్నారు.

జూదరులు అరెస్ట్

పుట్లూరు : పుట్లూరు మండల కేంద్రంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.12,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుడికి గాయం

రాయదుర్గం : పురపాలక సంఘంలో పారిశుధ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న తిప్పేస్వామి చేతికి సోమవారం బలమైన గాయమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రకు చెరకు రసం తీసుకొచ్చేందుకు దుకాణానికి వెళ్లగా అక్కడ కొడవలి చేతికి తగిలి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం అనంతపురానికి తరలించినట్లు తెలుస్తోంది. కాగా ఈ విషయమై శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రను వివరణ కోరగా కార్మికుడు చెట్టుకొమ్మను నరుకుతున్నప్పుడు చేతికి గాయమైందని తెలిపారు. కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా ఘటనపై విచారణ చేస్తామని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సోలార్ పరికరాలు దగ్ధం

రూ.6 లక్షలు నష్టం

బెలుగుప్ప : బెలుగుప్ప మండల కేంద్రానికి చెందిన బోయ శేఖర్‌కు చెందిన వ్యవసాయ తోటలో జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో సోలారు పరికరాలు, 35 కట్టలు డ్రిప్ వైరు దగ్ధమయ్యాయి. రూ.6 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించాలని ధర్నా

పుట్లూరు : ఇంటి స్థలాలు ఇచ్చిన లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అరకటవేముల గ్రామ సచివాలయం ఎదుట ఎపి వ్యవసాయ కార్మిక (సిపిఐ) మండల అధ్యక్షులు సి.పెద్దిరాజు అధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు పక్కా గృహాలు నిర్మించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. పేదలకి సొంతింటి కల కలగానే మిగిలిందన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి నిరుపేదలకి న్యాయం చెయ్యాలన్నారు. లబ్ధిదారులకు ఇసుక, స్టీల్, కంకర ప్రభుత్వమే ఇంటి వద్దకి ఉచితంగా చేర్చాలన్నారు. టీడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమాఖ్య మండల అధ్యక్షులు ఓబుళపతి, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి శాంతకుమారి, పెద్ద కొండయ్య, ఓబుల నాయుడు, దేవుడు అదెన్న, గోపాల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

29న వేలంపాటలు

నార్పల : నార్పల మేజర్ పంచాయతీకి సంబంధించి వారపు సంత, జంతువధ శాల, పాత బస్టాండు లోని మరుగుదొడ్లకు 2023-24 సంవత్సరానికి సంబంధించి సుంకం వసూలు చేసుకొను హక్కును పొందేందుకు ఈనెల 29న బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రెటరీ అశ్వర్థ నాయుడు తెలిపారు. వారపు సంతకు రూ.లక్ష, బస్టాండుకు రూ.లక్ష, మూత్రశాలలు, మరుగుదొడ్లకు రూ. 50 వేలు డిపాజిట్‌తో పాటు సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలంపాటలో పాల్గొనే వారికి గ్రామ పంచాయతీకి సంబంధించి ఎలాంటి బకాయిలు ఉండరాదని తెలిపారు. వేలం పాటను రద్దు పరచుటకు, వాయిదావేయుటకు గ్రామ పంచాయతీకి సర్వహక్కులు ఉంటాయని వెల్లడించారు.

యాడికి : ప్రతిఫలాదాయపు వనరుల బహిరంగ వేలం పాట ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈవో ఎర్రిస్వామి తెలిపారు. బస్టాండు, జంతువధశాల, దినసరి మార్కెట్ల సుంకం వసూలు చేసుకునే హక్కుకై వేలంపాటలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తిగల వారు నిర్ణయించిన డిపాజిట్ మొత్తం చెల్లించి పాట పాడవచ్చునన్నారు.

బహుళ మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ : బహుళ మాధ్యమాలను విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు సూచించారు. విడపనకల్ మండల పరిధిలోని గడేకల్, విడపనకల్, పాల్తూరు, హవలిగి జిల్లా పరిషత్ పాఠశాలలో సెల్కో సోలార్ లైటింగ్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ప్రకాష్ కుమార్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు ఎల్ఇడి టీవీలు, యుపిఎస్, సోలార్ సిస్టం, ఇతర సామగ్రిలను ఉచితంగా అందజేసే కార్యక్రమం చేపట్టడం శుభ పరిణామం అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా బహుళ మాధ్యమాల ద్వారా విద్యాబోధన అందించడానికి ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఊరుకోం...

కళ్యాణదుర్గం : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఊరుకునేది లేదని గిరిజన సంఘాల నాయకులు శివశంకర్‌నాయక్, తిప్పేస్వామి నాయక్, ధనుంజయనాయక్, సూర్యానాయక్ హెచ్చరించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.